ఆహా ఏమి రుచి!

- కొత్త ఆహార ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ
- బెనారసీ కిళ్లీ, మధురై జిగర్తాండాలకు గిరాకీ
- సరికొత్త రుచులను ఆస్వాదిస్తున్న నగరవాసులు





బెనారసీ, కోహినూర్ పాన్

సండే స్పెషల్

శ్రీకాకుళం:

బెనారస్ కిళ్లీ.. మధురై జిగర్తాండా.. ఇలా సరికొత్త రుచులను నగరవాసులు ఆస్వాదిస్తున్నారు. జిల్లావాసులకు అంతగా పరిచయం లేని, సుదూర ప్రాంతాల్లో ప్రాముఖ్యత కలిగిన చల్లటి పానీయాలు, స్వీట్లు, కిళ్లీలు, ఇతర ఆహార పదార్థాలను కొందరు ఔత్సాహిక వ్యాపారులు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. రుచి, నాణ్యతలో రాజీపడకపోవడం, ధరలు సైతం అందుబాటులో ఉండటంతో మంచి ఆదరణ ఉంటోందని వ్యాపారులు చెబుతున్నారు.



బెనారసి స్పెషల్ కిళ్లీ..

నగరానికి చెందిన ఓ వ్యాపారి ఆరేళ్ల క్రితం ఉత్తర ప్రదేశ్‌లోని బెనారస్ నుంచి ఓ వ్యక్తిని తీసుకుని వచ్చి బెనారసి కిళ్లీ పేరిట షాపు ఏర్పాటు చేశారు. దీనికి ఆదరణ లభిస్తుండటంతో అత్యంత ఖరీదైన కిళ్లీలను విక్రయించటం ప్రారంభించారు. ఇక్కడి కిళ్లీ ధరలు రూ.40 నుంచి రూ.2,300 వరకు ఉండటం విశేషం. మ్యాంగో, పైనాపిల్, చాక్లెట్, కోకోనట్ ఫ్లేవర్ కిళ్లీలను రూ.80 వరకు విక్రయిస్తున్నారు. ఛాహీపాన్ రూ.110, మహారాజా కిళ్లీ రూ.150 ధర పైమాటే. ఆరు కిళ్లీలు కలిగిన ఫ్యామిలీ పాన్ రూ.350లకు, 8 కిళ్లీలు కలిగిన థాళీ పాన్ రూ.500 విక్రయిస్తున్నారు. నవ వధూవరుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన కిళ్లీలను రూ.850లకు చొప్పున అమ్ముతుండటం విశేషం. అత్యంత ఖరీదైన రూ.2,300 కోహినూర్ పాన్ వీరి ప్రత్యేకత. సుగంధ, కుంకుమ పువ్వు, రబిడీ, డ్రైఫ్రూట్స్ వంటి ఖరీదైన ఆరోగ్యకరమైన వస్తువులను ఇందులో వినియోగిస్తుంటారు. మొలేటీ పాన్ పేరిట దగ్గు తగ్గేందుకు సైతం కిళ్లీలను అమ్ముతున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు సుగర్‌ఫ్రీ కిళ్లీలు కూడా అందుబాటులో ఉన్నాయి.

చల్లచల్లని జిగర్తాండా..

జిగర్తాండ పానీయం కూడా ఆదరణ పెరుగుతోంది. రెగ్యులర్, బాసంతి, పలోడా, జిగర్తాండా విత్ ఐస్‌క్రీం, జిగర్తాండ విత్ డ్రైఫ్రూట్‌లను రూ.70 నుంచి రూ.150 వరకు ధరల్లో విక్రయిస్తున్నారు. శరీరాన్ని చల్లబరిచే కతోరా అనే పదార్థం, పాలు, తాటి బెల్లం విని యోగిస్తున్నారు. ఇవి ఆరోగ్యపరంగా ఎంతో మేలు చేస్తాయని విక్రయదారులు చెబుతున్నారు.

పెరుగుతున్న ఆదరణ..



శ్రీకాకుళం నగరంలో జిగర్తాండ, బెనారసీ పాన్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. నిత్యం వందకు పైగా జిగర్తాండా స్వీట్, 150 వరకు బెనారసీ పాన్‌లు విక్రయిస్తున్నాం. పెళ్లిళ్ల సీజన్‌లో ప్రత్యేక పాన్, కోహినూర్ పాన్‌లకు ఎక్కువగా ఆర్డర్లు వస్తున్నాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా కిళ్లీలు, స్వీట్స్ కొనుగోలు చేస్తున్నారు.

– జ్యోల, పాన్, స్వీట్ తయారీదారుడు, శ్రీకాకుళం

వృథాగా తాగునీరు



దోమాం గ్రామంలో కుళాయిల ద్వారా తాగునీరు వృథాగా పోతోంది. చాలాచోట్ల ట్యాపులు ఏర్పాటు చేయకపోవడం, పాడైన చోట్ల కొత్తవి వేయకపోవడంతో బిందెల్లో పట్టి సమయం తప్ప మిగతా వేళల్లో నీరు వృథా అవుతోంది. అధికారులు స్పందించి ట్యాపులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్


తవ్వారు..వదిలేశారు



బొందిలీపురంలో మున్సిపల్ సిబ్బంది నెలరోజుల క్రితం తవ్వి వదిలేసిన గొయ్యితో ప్రమాదం పొంచి ఉంది. కాలువ మరమ్మతుల కోసం సుమారు నాలుగు అడుగులు గొయ్యి తవ్వారు. తర్వాత కప్పకపోవడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– శ్రీకాకుళం

చివరి మజిలీకీ చిక్కులే



చంద్రయ్యపేట శ్మశానవాటికకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే గట్లు, పొలాల్లో దిగి మోసుకెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి శ్మశానవాటికకు రహదారి సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

– జి.సిగడాం

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాతలు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన బుర్రా రాంబాయి, ఎస్.శ్రీనివాసరావు దంపతుల కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఈవో వై.భద్రాజీకి శనివారం అందించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రూ.లక్ష అంతకు మించి విరాళాలిచ్చిన దాతలకు రథసప్తమి వంటి పర్వదినాల్లో విశిష్ట దర్శనాలకు డోనర్ పాసులను అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులు, అర్చకులు ఇప్పిలి ఫణీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ స్మారకసభకు తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దళిత సంఘ నాయకులు

రణస్థలం: విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరిగే గద్దర్ స్మారక సభకు తరలిరావాలని ఏపీ దళిత మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రాము పిలుపునిచ్చారు. శనివారం రణస్థలంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 'గద్దర్ అన్న యాదిలో' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు గద్దర్ కుమార్తె వెన్నెల గద్దర్ హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్ నేరం



తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తున్న సీఐ నాగరాజు

శ్రీకాకుళం క్రైమ్: మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరమని ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ద్విచక్రవాహనాలు నడుపుతున్న మైనర్లు, వారి తల్లిదండ్రులకు ఎస్పీ ఆదేశాల మేరకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. లైసెన్సు ఉంటేనే వాహనాలు నడపాలని స్పష్టం చేశారు.

శ్రీకాకుళం రూరల్ స్టేషన్ ఎస్ఐగా రాము



శ్రీకాకుళం రూరల్: అల్లు సీతారామరాజు జిల్లాలో పనిచేసిన ఎస్ఐ కె.రాము శ్రీకాకుళం రూరల్ స్టేషన్ ఎస్ఐగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పనిచేసిన వాసుదేవరావు వీఆర్‌కు బదిలీ అయ్యారు.

తోపుడుబళ్లను తొలగించండి



తోపుడుబళ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని పొట్టిశ్రీరాములు పెద్ద మార్కెట్‌లో తోపుడు బళ్లు అడ్డదిడ్డంగా ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, తక్షణమే తొలగించాలని ట్రాఫిక్ సీఐ నాగరాజు సూచించారు. ఎస్పీ ఆదేశాలతో శనివారం మార్కెట్‌లోని తోపుడు బళ్ల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికిప్పుడే తొలగిస్తే తాము రోడ్డున పడతామని, కొంత సమయమివ్వాలని సీఐని వ్యాపారులంతా ముక్తకంఠంతో కోరారు. దానికి సీఐ రెండు రోజులు సమయం ఇస్తున్నానని చెప్పడంతో వారంతా అంగీకరించారు.

మూడు వేలమందికి అన్నదానం



రెడ్డిక వీధిలో అన్నదానం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని రెడ్డిక వీధిలో విజయదుర్గమ్మ ఆలయం వద్ద దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం అన్నదానం నిర్వహించారు. యువజన సంఘం ఆధ్వర్యంలో మూడు వేలమంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

అభినయం అదరహో..



బీఎంఎస్ పట్నాయిక్‌ను సత్కరిస్తున్న దృశ్యం



కొండగాలి నాటికలో ఓ దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సూత్రా ఫౌండేషన్, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో జిల్లా స్థాయి నాటిక పోటీల్లో భాగంగా శనివారం ప్రదర్శించిన నాటికలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. పెద్దమేరంగికు చెందిన రౌతు అప్పలనాయుడు కల్చరల్, ట్రస్టు ఆధ్వర్యంలో 'కొండగాలి' నాటిక జిల్లాలో 1960నాటికి గిరిజనుల జీవితాలకు అద్దం పట్టింది. అత్తిలి కృష్ణారావు రచించగా, రౌతు వాసుదేవరావు దర్శకత్వం వహించారు. కత్తివరం గ్రామానికి చెందిన నీలకంటేశ్వరా నాటక కళాసమితి 'మార్పు' నాటిక.. ఇంటి పెద్ద చనిపోతే ఆ కుటుంబం ఇబ్బందులను ఎదుర్కొని నిలిచిన ఇతి వృత్తంగా ఆధారంగా సాగింది. రచన సిహెచ్.రామ్మూర్తి, దర్శకత్వం బి.రాము అందించారు. బొరివంకకు చెందిన శార్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం 'నిర్జీవ నినాదం' నాటిక..ఇంటగెలిచి రచ్చగెలవాలనే ఇతివృత్తంగా సాగింది. ముందుగా ప్రముఖ నాటక దర్శకుడు బీఎంఎస్ పట్నాయిక్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుమిత్రా కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ, సూత్రా ఫౌండేషన్ అధ్యక్షుడు నిక్కు హరిసత్యనారాయణ, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, కార్యదర్శి గుత్తు చిన్నారావు, ఉపాధ్యక్షులు మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, కొమనాపల్లి సురేష్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆదివారం ది డెత్ ఆఫ్ ఎ మ్యాన్ ఈటర్ (బొరివంక), సప్తమ సూత్రం(పాగిరి) నాటిక ప్రదర్శనలు జరుగుతాయని, ముగింపు సభలో విజేతలకు, కళాకారులను సత్కరిస్తామని నిర్వాహకులు తెలిపారు.

యూజీసీ నెట్‌కు అర్హత

అరసవల్లి: యూజీసీ నెట్ 2024 అర్హత పరీక్షల్లో అరసవల్లికి చెందిన ఉంగటి రమ్య, పీఎల్‌పీ భారతిలు అర్హత సాధించారు. శుక్రవారం విడుదలైన నెట్ ఫలితాల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)కు రమ్య ఎంపిక కావడంతో కుటుంబసభ్యులు పాపారావు, వెంకటరమణమూర్తి దంపతులు అభినందనలు తెలియజేశారు. అలాగే ఆదిత్యనగర్ కాలనీకి చెందిన భారతి కూడా పీహెచ్‌డికి అర్హత సాధించారు. ఈమె శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నారు. అరసవల్లికి చెందిన వీరిద్దరూ నెట్ అర్హత సాధించడంపై స్థానికులు అభినందనలు తెలియజేశారు.

మురుగునీరే సాగునీరు..

రైతు కంట కన్నీరు

- రైతులకు తప్పని కష్టాలు
- డ్రైనేజీ నీటినే పంటకు తోడిన అన్నదాత



యాతం ద్వారా డ్రైనేజీ నీటిని తోడుతున్న రైతు



కూరగాయ పంటలను తడుపుతూ..

శ్రీకాకుళం రూరల్: అన్నదాతకు సాగునీటి కష్టాలు వీడటం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల కష్టాలను పట్టించుకునే వారే కరువయ్యారు. రైతులకు దిక్కుతోచని స్థితిలో కాలువలు ద్వారా వచ్చే డ్రైనేజీ నీటిని వినియోగిస్తూ పంట పొలాలను తడుపుకోవాల్సిన దుస్థితి దాపురించింది. రూరల్ మండల పరిధిలోని సింగుపురం గ్రామానికి చెందిన రైతు నర్సింగరావు జాతీయ రహదారిని ఆనుకుని తనకున్న ఐదు సెంట్ల విస్తీర్ణంలో చిక్కుడు, బెండ, బీరకాయ, కాకర, దొండకాయ కూరల సాగు వేశాడు. కొద్దిరోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయి.

శుక్రవారం కురిసిన మోస్తరు వర్షానికి పక్కనే ఉన్న డ్రైనేజీ నిండుగా ప్రవహించడంతో ఆ నీటినే తోడుతూ పంట పొలాలను తడిపాడు. పంటకు నష్టం జరిగే అవకాశమున్నా తప్పనిసరి పరిస్థితుల్లో ఇలా చేయాల్సి వస్తోందని వాపోయాడు. వాగులు, గెడ్డల ద్వారా శివారు ప్రాంతాలకు నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోయాడు.

మద్యం షాపును మార్చండి



ఎక్సైజ్ అధికారులతో మహిళల వాగ్వాదం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును మరోచోటకు మార్పు చేయాలని స్థానికులు కోరారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణతో మాట్లాడుతూ షాపును వేరే స్థలానికి మార్పు చేయకపోతే ఆందోళన తప్పదని మహిళలు స్పష్టం చేశారు. రాత్రి 11 గంటలు వరకు మద్యం షాపు తెరిచి ఉంటోందని, జనావాసాలు మధ్య ఉండటంతో విద్యార్థులు, మహిళల భద్రతకు సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమీపంలో షిర్డిసాయి బాబా ఆలయం ఉందని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు 'ప్రకృతి' కూరగాయలు



పంటలను పరిశీలిస్తున్న పీవో రుూన్సీ

రణస్థలం: సమగ్ర పోషకాలు గల ఆహారాన్ని పండించాలంటే ప్రకృతి వ్యవసాయమే మేలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంభాపు కృష్ణ అన్నారు. రణస్థలంలో మహిళా రైతులు పెద్దింటి రాజేశ్వరి, జి.రమణమ్మ, జి.జ్యోతిలు ఏటీఎం, సూర్యమండల నమూనాలో పండిస్తున్న పంటలను ఐసీడీఎస్ పీవో సీహెచ్ రుూన్సీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విధంగా పండించిన కూరగాయలు, ఆకుకూరలను రణస్థలం, లావేరు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసేలా చర్యలు చేపడతామని చెప్పారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ఎచ్చెర్ల: లావేరు మండలం పోతయ్యవలసలో పల్లె పండుగలో భాగంగా శనివారం సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు కొంపెల్ల లక్ష్మణరావు, కొంపెల్ల పవన్, మద్దాల తేజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



శ్రీకాకుళం న్యూకాలనీ : శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు ఎంతో పేరుప్రఖ్యాతులు కలిగి ఉందని.. దానిని కొనసాగించేందుకు ప్రతిఒక్కరూ సమష్టిగా పనిచేయాలని కళాశాల విద్య ఆర్జేడీ (రాజమండ్రి) డాక్టర్ ఎస్.శోభారాణి అన్నారు. శనివారం కళాశాలలో సీనియర్ విద్యార్థులు ఫస్టియర్ స్టూడెంట్లకు ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఆటపాటలతో సందడి చేశారు. అంతకుముందు ఆర్జేడీ శోభారాణి కళాశాలలో పలు విభాగాలను పరిశీలించి అధ్యాపకులతో సమావేశమయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అధ్యక్షతను జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హరిత, ప్రదీప్, పోలినాయుడు, సీహెచ్ విజయభాస్కర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అరికడదాం



శ్రీకాకుళం అర్బన్ : మానవ అక్రమ రవాణా లేని సమాజ స్థాపన మనందరి కర్తవ్యమని స్టార్ వాకర్స్ ప్రతినిధులు పేర్కొన్నారు. వాక్ ఫర్ ఫ్రీడమ్-నిశ్శబ్ద నడక పేరిట శనివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ ఎన్‌జీవో ఆస్ట్రేలియా ఏ-21, ది మూమెంట్ ఇండియా ముంబై సహకారంతో గ్రామజ్యోతి సొసైటీ, స్టార్ వాకర్స్ క్లబ్, రోజస్ సంస్థ, ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రోజస్ సంస్థ అధ్యక్షుడు జి.వి.నాగభూషణరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు వాసుదేవరావు, బి.వి.రవిశంకర్, జి.లక్ష్మి, గుడ్ల జగ్గారావు, డాక్టర్ ఎం.వాసుదేవ్, జి.వాసుదేవరావు, ఎం.మల్లిబాబు, నల్లబాటి కృష్ణమూర్తి, ఊన్న నాగభూషణరావు, పట్నాన రామారావు, గిరిజన ఆశ్రమ విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై సంత సీతారాంపురం సైన్క్ కాలేజ్ ఏజీబీఎస్సీ విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అనకాపల్లి జిల్లా రావికమతం మండలం మేడివాడ గ్రామంలో వీరు పర్యటించారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వరిలో సుడి దోమ నియంత్రణ పద్ధతులను రైతులకు వివరించారు.

వైభవంగా దుర్గాదేవి నిమజ్జనోత్సవం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని రిమ్స్ రోడ్డులో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి దుర్గాదేవి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, యువకుల డ్యాన్సులతో ఉత్సాహంగా సాగింది. అనంతరం దేవీ విగ్రహాన్ని నాగావళి నదిలో నిమజ్జనం చేశారు.

వెంకన్నకు విశేష పూజలు



శ్రీకాకుళం కల్చరల్ : నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో శ్యామలరావు ఏర్పాట్లు చేశారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



ఎచ్చెర్ల క్యాంపస్: పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సి.డాక్ మాస్టర్ ట్రైనర్ ఎం.వెంకటకిషోర్ అన్నారు. ఎచ్చెర్లలోని వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో శనివారం ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంకల్ప ఆధ్వర్యంలో 'హై పెర్ఫార్మెన్స్ కంప్యూటరింగ్' అంశంపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణమూర్తినాయుడు, మేనేజ్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయి మహానగర సంకీర్తన

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవం సందర్భంగా నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఆదివారం మహా నగర సంకీర్తన ఏర్పాటు చేస్తున్నట్లు పెద్దమందిరం కన్వీనర్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు ఆధ్వర్యంలో సాయంత్రం 3.30 గంటలకు జరిగే జోనల్ స్థాయి నగర సంకీర్తనకు అందరూ హాజరు కావాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం ఎచ్చెర్ల మండలంలో పలువురిని పరామర్శించారు. డి.మత్స్యలేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు కుందు లక్ష్మయ్య, దుమ్ము లక్ష్మయ్యలు మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఆయన వెంట నాయకులు సనపల పారాయణరావు, ఎంపీటీసీ చోడిపల్లి వలసమ్మ, మూగి శ్రీరాములు, నక్క కృష్ణమూర్తి, బోర గోవిందరెడ్డి, దుంప చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

శ్రీకాకుళం

9912220343

Office mail : sklmadvt@gmail.com